

హరే కృష్ణ..!

- నేటి నుంచి జన్మాష్టమి వేడుకలు
- ముస్తాబైన ఇస్కాన్ మందిరం



విద్యుత్ దీపకాంతుల్లో ఇస్కాన్ మందిరం





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు జిల్లాలోని కృష్ణమందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. అనంతపురం నగరంలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నుంచి వేడుకలు మొదలౌతాయి. ఇస్కాన్ మందిరాన్ని రంగు రంగులవిద్యుద్దీపాలతో అలంకరించారు. గోకుల కృష్ణుడిని దర్శించుకునేందుకు వచ్చే వేలాదిమంది భక్తుల కోసం ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. ఇస్కాన్ మందిర చైర్మెన్ దామోదర్ గౌరంగదాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తల్లిదండ్రులు సైతం తమ చిన్నారులను రాధాకృష్ణుల రూపంలో చూసుకునేందుకు సిద్ధమయ్యారు. వివిధ ప్రాంతాల్లో చిన్ని కృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నారు. - అనంతపురం కల్చరల్



ఇస్కాన్ మందిరంలో రాధాపార్థసారథులు



కసాపురంలో గజ వాహనంపై స్వామివారు

వాయుపుత్రా..! వందనం

అంజన్న ఆలయాలకు క్యూకట్టిన భక్తులు



1. అలంకారాలలో నెట్టికంటి ఆంజనేయుడు 2. నేమకల్లులో లక్ష తులసీదళాల అలంకరణలో స్వామివారు 3. మురడిలో పూజలందుకున్న స్వామివారు

గుంతకల్లు/బొమ్మనహాళ్/ డి.హీరేహాళ్, ఆగస్టు 24: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడో శనివారం జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో వేకువజామునే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విష్ణు పారాయణం, అష్టోత్తరం పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ చాలీసా, సుందరకాండను పఠించారు. కసాపురంలో సీతారామ లక్ష్మణ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి గజవాహనంపై కూర్చోబెట్టి కన్నుల పండువగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అప్పు చెల్లించలేదని హత్య



రాజేంద్ర మృతదేహం

తాడిపత్రి, ఆగస్టు24: పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన రాజేంద్ర (40)ను అప్పు చెల్లించలేదని ఆదే కాలనీకి చెందిన తిప్పారెడ్డితోపాటు కుటుంబ సభ్యులు హత్య చేసినట్లు డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపారు. రాజేంద్ర లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్లక్రితం ఇదే కాలనీలో ఉంటున్న తిప్పారెడ్డి భార్య నాగలక్ష్మి వద్ద మృతుడి భార్య ఉమాదేవి రూ.11వేలు అప్పుగా తీసుకుంది. అధిక వడ్డీ కావడంతో ప్రస్తుతం ఈ మొత్తం రూ.38వేలకు చేరుకుంది. దీంతో అప్పు మొత్తం చెల్లించాలని ఉమాదేవిని ఒత్తిడి చేసేవారు. శనివారం మరోసారి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడిచేయడంతో భర్త రాజేంద్ర తాను వెళ్లి మాట్లాడి వస్తానని చెప్పి వెళ్లాడన్నారు. తిప్పారెడ్డి ఇంటివద్దకు వచ్చిన రాజేంద్ర అప్పు చెల్లిస్తానని మరింత సమయం కావాలని కోరాడు. కానీ వారు ఒప్పుకోకపోవడంతో మాటమాట పెరిగి రాజేంద్రపై కట్టెలతో దాడికి దిగారు. ఈ దాడిలో గాయపడ్డ రాజేంద్ర కొంతదూరం వెళ్లి కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు, ఏఎస్‌ఐ నాగన్నలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్య కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

డిప్లొమా విద్యార్థి ఆత్మహత్య



రాజు (ఫైల్)

డి.హీరేహాళ్, ఆగస్టు 24: మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన రాజు (18) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యేసప్ప కుమారుడు రాజు అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వేరొక కోర్సుకు సంబంధించి మరికొన్ని రోజులలో పరీక్షలు ఉండటంతో దాని ప్రిపరేషన్ కోసం రెండు రోజుల కిందట రాజు స్వగ్రామానికి వచ్చాడు. రోజు మాదిరిగానే తల్లిదండ్రులు శనివారం ఉదయం 8 గంటలకే పనులకు వెళ్లారు. రాజు ఇంట్లోనే చదువుకుంటూ ఉండిపోయాడు. తల్లిదండ్రులు పనిముగించుకుని మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చారు. తలుపులు తీసే ప్రయత్నం చేయగా ఎంతసేపటికీ అవి తెరుచుకోలేదు. యేసప్ప చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టాడు. అక్కడ ఉరికి వేలాడుతూ కుమారుడు కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దించి చికిత్స కోసం కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి యేసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రేపు ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం, ఆగస్టు 24: ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం చేపట్టే గ్రీవెన్స్‌ను వచ్చేవారం రద్దు చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణాష్టమి పండుగ సోమవారం ఉన్న సందర్భంగా ఆరోజు ప్రభుత్వ సెలవు ఉందన్నారు. దీంతో ఈనెల 26న గ్రీవెన్స్ ఉండదన్నారు.

పంచాయతీకి పైసలు చేదా..?

- తాగునీటి సౌకర్యానికే నెలకు రూ.లక్ష
- ల్యాండ్ కన్వర్షన్ చేయకనే మార్కెట్ నిర్వహణ
- రెవెన్యూ శాఖకూ మండీ నిర్వాహకుల టోపీ
- ట్రేడ్ లైసెన్స్ లేదు.. ఉన్నవాటికి రెన్యువల్ లేదు

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో తవ్వేకొద్దీ అవినీతి

పన్ను వసూలు పట్టని అధికారులు.. ఖర్చులు మాత్రం తడిసి మోపెడు



అనంతపురం రూరల్, ఆగస్టు 24: వ్యాపారం చేయాలంటే నిబంధనలు పాటించాలి. చట్ట ప్రకారం అనుమతులు తీసుకోవాలి. కానీ రూ.కోట్ల లావాదేవీలు జరిగే కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఇవేవీ అమలు కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. టమోటా మార్కెట్ నిర్వహణకు మార్కెటింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ పొందాలి. 2019లో పండ్లు, కూరగాయల ఉత్పత్తులకు ప్రభుత్వం సెస్ మినహాయించింది. దీంతో మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులు టమోటా మార్కెట్ గురించి పట్టించుకోవడం మానేశారు. సెసె మినహాయింపు ఉన్నా.. మార్కెట్ నిర్వహణకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ నుంచి అనుమతులు ఉండాల్సిందేనని ఆ శాఖ అధికారులు అంటున్నారు. కొందరికి గతంలో ట్రేడ్ లైసెన్స్ ఉన్నా.. 2019 తరువాత రెన్యువల్ చేయించలేదని సమాచారం. ఇంత పెద్ద మార్కెట్.. అదీ జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నా.. ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ మార్కెట్ కావడంతో చాలామంది మండీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టమోటా ధరలు వారు అనుకున్న విధంగా పెరుగుతాయి.. తగ్గుతాయి. ఇదే క్రమంలో బెదిరింపులు.. అక్రమ వసూళ్ల యథేచ్ఛగా సాగిపోతున్నాయి. రైతుల నుంచి నాలుగు శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా.. పది శాతం దండుకుంటున్నారు. కలెక్టర్ దృష్టి సాధిస్తే తప్ప దోపిడీకి అడ్డుకట్ట పడటం సాధ్యం కాదని బాధితులు అంటున్నారు.

ల్యాండ్ కన్వర్షన్ ఏదీ..?

కక్కలపల్లి టమోటా మార్కెట్ సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మండీల నిర్వాహకులు భూ యజమానుల వద్ద లీజుకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. మార్కెట్ నిర్వహణ వాణిజ్యపరమైనది. కాబట్టి మార్కెట్‌కు వినియోగించే భూమిని కమర్షియల్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయించుకోవాలి. కానీ టమోటా మార్కెట్‌లో ల్యాండ్ కన్వర్షన్ చేయించిన ఆనవాళ్లు లేవు. రెవెన్యూ నిబంధనల ప్రకారం ల్యాండ్ కన్వర్షన్‌కు భూమి విలువలో 5 శాతం పన్ను చెల్లించాలి. తద్వారా రెవెన్యూ శాఖకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. కానీ ఆ శాఖకు ఆదాయం అవసరం లేదేమో.. పట్టించుకోవడం లేదు. మార్కెట్‌కు వినియోగిస్తున్న భూముల్లో ఎవరివి..? వ్యాపారులు వారికి ఎంత చెల్లిస్తున్నారు..? పంచాయతీకి పన్ను ఎంత చెల్లిస్తున్నారు..? ల్యాండ్ కన్వర్షన్ చేయించని కారణంగా రెవెన్యూ శాఖకు ఎంత నష్టం జరుగుతోంది..? ఈ లెక్కలను జిల్లా ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

పంచాయతీకీ అంతంతే..

టమోటా మార్కెట్ నిర్వహణ కక్కలపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతోంది. కాబట్టి ఖచ్చితంగా పన్ను చెల్లించాలి. వ్యాపారం కాబట్టి.. కమర్షిల్ పన్ను చెల్లించాలి. మండీలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో, అందులో భవనాలు, తదితరాలను పరిగణనలోకి తీసుకుని పన్ను విధించాల్సి ఉంటుంది. కానీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. వాణిజ్య పన్ను వసూలు చేస్తే కక్కలపల్లి పంచాయతీకి వేలాది రూపాయల ఆదాయం సమకూరుతుంది. కానీ వ్యాపారులు లైసెన్ ఫీజు పేరిట రూ.5వేలు, రూ.2వేలు కట్టి చేతులు దులుపుకుంటున్నారు. మార్కెట్‌లో 28 మండీలు ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ఈ మాత్రం పన్నైనా చెల్లిస్తున్నాయి. గత ఏడాది ఏ ఒక్క వ్యాపారీ పన్ను చెల్లించలేదని సమాచారం. రూ.80 వేలదాకా బకాయి ఉన్నట్లు సమాచారం.

పంచాయతీపై భారం

టమోటా మార్కెట్ ద్వారా కక్కలపల్లి పంచాయతీకి ఆదాయం సమకూరడం అటుంచి.. ఖర్చు తడిసి మోపడవుతోంది. మార్కెట్‌పై ఆధారపడ్డవారు పంచాయతీ పరిధిలో వందల మంది ఉన్నారు. వీరికి విద్యుత్, మంచినీరు తదితర మౌలిక వసతులను పంచాయతీ కల్పిస్తోంది. ఒక్క నీటి వినియోగం కారణంగానే కరెంటు బిల్లుల వేలల్లో చెల్లిస్తోంది. పంచాయతీ పరిధిలో 15 బోర్లు ఉన్నాయి. ఇందులో మార్కెట్ పరిధిలోనే 9 ఉన్నాయి. కనీసం ఐదు బోరుబావుల నీటిని మార్కెట్ అవసరాలకు వాడుకుంటున్నారు. పదిహేను బోరుబావుల మోటార్లకు నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు కరెంటు బిల్లుల రూపంలో పంచాయతీ చెల్లిస్తోంది. మార్కెట్ అవసరాలకు వాడుతున్న బోరుబావులకే నెలకు రూ.లక్ష దాకా వెచ్చిస్తోంది. మార్కెట్ కోసం పంచాయతీ ఖర్చు చేయడమే తప్ప.. మార్కెట్ నుంచి ఆదాయం రావడం లేదు. అయినా అధికారులకు పట్టడం లేదు. కక్కలపల్లి పంచాయతీకి ఉన్న అతిపెద్ద ఆదాయ వనరు టమోటా మార్కెట్. కానీ సద్వినియోగం చేసుకోవడం లేదు. ఏళ్ల తరబడి వాహనాల పన్ను, మండీల పన్ను వసూలు చేయకపోవడం విస్తుగొలుపుతోంది. పైగా, మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తులు వసూళ్లకు పాల్పడుతున్నా.. చేష్టలుడిగి చూస్తోంది.

టమోటా రైతులను ఆదుకోండి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం టౌన్: టమోటా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మార్క్‌ఫెడ్ అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో టమోటా రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి ఆరాతీశారు. ఒకేసారి పంట రావడంతో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని సూచించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు బజార్లకు టమోటా సరఫరా చేయాలని సూచించారు. జిల్లాలో టమోటా ప్రాసెస్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై..

భూసమస్యలపై ఆర్డీఓలు, తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ అన్నారు. వంశపారపర్యంగా వచ్చే భూ సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలుసుకోవాలని ఆదేశించారు. లేదంటే సమస్యలు పెరుగుతాయని హెచ్చరించారు. వర్క్‌షాపులలో అవగాహన కల్పిస్తామని, పాలనలో వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్వో రామకృష్ణారెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు.

జూడాల సమ్మె విరమణ



జిల్లా సర్వజన ఆస్పత్రిలో రిలే దీక్షలు చేపడుతున్న జూడాలు (ఫైల్)

అనంతపురం టౌన్, ఆగస్టు 24: జూనియర్ డాక్టర్లు, పీజీలు సమ్మె విరమించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో రాత్రిడ్యూటీలో ఉన్న పీజీ మహిళా డాక్టర్‌ను హత్య చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గత పదిరోజులుగా వీరు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. న్యాయస్థానాలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఈఘటనపై సీరియస్‌గా స్పందించాయి. పైగా ఆస్పత్రులలో మహిళా డాక్టర్లకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాయి. ఈనేపథ్యంలో జిల్లా బోధనాసుపత్రిలోను ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు ఆందోళనలు చేస్తున్న జూడాలు వద్దకు వెళ్లి భద్రతా చర్యలు తీసుకుంటున్నాం, రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సమ్మె విరమించాలని కోరారు. అయితే ఆసమయంలో మాకు పూర్తిగా న్యాయం జరిగేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. చివరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాసుపత్రులలో జూడాలు ఆందోళనలు విరమించడంతో అనంతలోను సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు.

జీబీసీ డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయండి

మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండ, ఆగస్టు 24: విడపనకల్లు మండలంలోని రైతులు జీబీసీ కింద పొలాల్లో మిరప నాటుకోవడానికి ఏర్పాటు చేసుకున్నారని, వెంటనే డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను ఆదేశించారు. మిరప పంటను సాగు చేసుకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందిని మంత్రి దృష్టికి మండల కన్వీనర్ మారయ్య తీసుకెళ్లారు. దీనిపై స్పందించి మంత్రి హెచ్చెల్సీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఎస్ఈతో ప్రస్తావించారు. ఇప్పటికే రైతులు నర్సరీలు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో మిరపనారు పెంచుకున్నారని నీటిని ఇవ్వడం ఆలస్యం చేస్తే నారును నాటుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. మిరపరైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే నీటిని విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అమ్మా.. కడుపు నొప్పి..!



బడిలో నీరు తాగితే ఒట్టు.. టాయిలెట్‌కు వెళితే శిక్షించడమే కారణం

ఆ అమ్మాయి గుత్తి ఆర్ఎస్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. ప్రతి రోజూ బడి నుంచి ఇంటికి వెళ్లగానే.. 'అమ్మా కడుపునొస్తోంది..' అని బాధపడుతోంది. 'రోజూ కడుపు నొప్పి ఏమిటే..?' అని అమ్మ ఆరా తీసింది. బడిలో నీరు తాగడం లేదని, టాయ్‌లెట్‌కు వెళ్లడం లేదని తెలిసింది. ఇంకాస్త లోతుగా పరిశీలించిన అమ్మకు.. తన బిడ్డమాత్రమే కాదు.. చాలామంది ఇలా బాధపడుతున్నారని అర్థమైంది. ఆ బడిలో టాయిలెట్‌కు వెళ్లేవారి పేర్లను రిజిస్టర్‌లో రాస్తారట. 'ఎన్నిసార్లు వెళతావ్..? అంత సమయం ఎందుకు పట్టింది..?' అని దండిస్తారట. దీంతో చిన్నారులు భయపడిపోయారు. నీరు తాగితే టాయిలెట్ వెళ్లాల్సి వస్తుందని తాగడమే మానేశారు. రెండు మూడు అంతస్తుల్లో ఉన్న ఆ పాఠశాలలో టాయిలెట్లు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉన్నాయి. మూడో అంతస్తు పిల్లలు కూడా కిందికి దిగిరావాల్సిందే. తల్లిదండ్రులు టీచర్లను అడిగితే.. 'మాదేముంది మేడమ్.. మేనేజ్‌మెంట్ ఎట్ల చెప్పితే అట్ల చేస్తాం..' అని చేతులెత్తేశారట. ప్రైవేటు బడిలో యాజమాన్యాన్ని ప్రశ్నించడమే..!? ఇంకేమైనా ఉందా..? వారిని ప్రశ్నిస్తే తమ బిడ్డలను టార్గెట్ చేస్తారని భయం..! పిల్లల భవిష్యత్తు కోసం పెద్ద పెద్ద తోపులే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యలకు వణికిపోతుంటారు. చేతులు కట్టుకుని వారి ఎదుట నిలబడుతుంటారు. అందుకే.. ఎవరూ ప్రశ్నించలేదు. ఒక్క గుత్తి ఆర్ఎస్ బడిలోనే కాదు.. జిల్లాలోని చాలా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఇదే పరిస్థితి. మలమూత్ర విసర్జన చేయకపోతే చిన్నారుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తింటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. (వివరాలు 7లో..)

- స్కూళ్లలో తాగునీరు సరిగా ఉంచని యాజమాన్యాలు
- కొన్ని పాఠశాలల్లో టాయిలెట్లకు వెళ్లకుండా కట్టడి
- ప్రైవేట్ స్కూళ్లలో అడ్డగోలు నిబంధనలు
- ఇన్‌స్పెక్షన్ మర్చిపోయిన.. ఎంఈఓలు, డీవైఈఓలు
- చిన్నారుల ఆరోగ్యంతో యాజమాన్యాల చెలగాటం
- గతంలో వాటర్ బెల్
- నీరు తాగకపోతే ప్రమాదం తప్పదని వైద్య నిపుణుల హెచ్చరిక



వసి వాడుతున్న పసిప్రాయం

ఉదయం లేచినప్పటి నుంచి పరుగులే

మూడు పూటలా ముద్దతినని పిల్లలు ఎందరో

ప్రైవేట్ స్కూల్స్ డేటా...		
పీఎస్	208	52,750
యూపీ	215	34,222
హైస్కూల్	247	78,680
మొత్తం	670	1,65,652



చదువుల తీరు మారింది. 'చదివింపుల' జోరు పెరిగింది. కార్పొరేట్ చదువులన్నీ కాంక్రీట్ జంగిల్‌లో నడుస్తున్నాయి. అంతా హడావుడే. ఉరుకులు.. పరుగులే. ఈ క్రమంలో పసిపిల్లలు దాహమేస్తే నీళ్లు తాగలేకపోవడం, మూత్ర మొస్తే పోయలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలల యాజమాన్యాలు అర్థం పర్థం లేని నిబంధనలతో పసిమొగ్గలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దీంతో చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యాహక్కు చట్టం-2009 నిబంధనలను ఏ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల కూడా పాటించడం లేదు. స్కూళ్లను తనిఖీ చేయాల్సిన విద్యాశాఖాధికారులు వాటి ఊసే మరచిపోయారు. దీంతో ఎవరి నిబంధనలు వారివన్నట్లుగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ఒకవేళ ప్రశ్నిద్దామని అనుకున్నా.. తర్వాత తమ పిల్లలను ఎక్కడ టార్గెట్ చేస్తారోనన్న భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు మిన్నకుండిపోతున్నారు. ఈ పరిస్థితులు పిల్లల ఆరోగ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయని అనేకమంది ఆరోపిస్తున్నారు.

అనంతపురం విద్య



డీఈఓ ఆఫీస్

వాటర్ బెల్... డల్

విద్యార్థులు డీహైడ్రేట్ కాకుండా ఉండటం కోసం గతంలో ప్రభుత్వం వాటర్ బెల్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం పాఠశాల సమయంలో మూడుసార్లు గంట మోగిస్తారు. అది మోగగానే పిల్లలు నీళ్లు తాగాలి. ఉదయం 8.45 గంటలకు ఒకసారి, 10.50 గంటలకు ఒకసారి, 11.50 గంటలకు ఒకసారి బెల్ మొగిస్తారు. బెల్ మోగిన తర్వాత సుమారు 5 నిమిషాల వ్యవధిలో పిల్లలు నీళ్లు తాగాల్సి ఉంటుంది. ఇది వేసవిలో అమలు చేయాలని చెప్పారు. ఏడాది అంతా ఏర్పాటు చేసినా మంచిదే అని వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులు పుస్తకాలు, హోంవర్క్, క్లాస్ రూమ్ టాస్క్ అంటూ హడావుడి, ఒత్తిడి వల్ల పిల్లలు సకాలంలో నీళ్లు తాగడం లేదు. విద్యార్థులపై తాగునీటి ప్రభావం చాలా పడుతోంది. ఇళ్ల నుంచి భోజనం క్యారియర్‌తోపాటు స్కూళ్లకు తీసుకెళ్లిన వాటర్ బాటిళ్లను సగానికి సగం కూడా తాగకుండానే విద్యార్థులు ఇళ్లకు వెనక్కు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా పిల్లల వెంట పంపే వాటర్ బాటిళ్లు చాలా వరకూ అర లీటర్ లేదా పావు లీటర్ బాటిళ్లే. అయితే వాటిని సైతం పూర్తి స్థాయిలో తాగకుండానే పిల్లలు ఇళ్లకు తీసుకొస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఇదే తంతు జరుగుతోంది.

తిండి కూడా సరిగా తినరు

స్కూళ్లకు వెళ్లే పిల్లలు సక్రమంగా తిండి కూడా తినడం లేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సుమారు 6-11 ఏళ్ల మధ్యలో ఉన్న బాల బాలికలు ప్రధానంగా స్కూళ్లలో భోజనం సరిగా తినడం లేదు. స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్లే బస్సులు ఉదయం 7 గంటలు, 7.30 గంటలకే వస్తున్నాయి. పల్లెల నుంచి పట్టణాలకు పిల్లలను తీసుకొచ్చే బస్సులు చాలా వరకూ ఇదే సమయానికి వస్తున్నాయి. 6 గంటలకు అటూ ఇటుగా నిద్ర లేచిన పిల్లలు, స్నానం చేసి 7 గంటల కల్లా స్కూలుకెళ్లడానికి సిద్ధం అవుతారు. ఆ సమయానికి తల్లులు ఇళ్లలో టిఫిన్ రెడీ చేసినా అంత పొద్దు పొద్దునే తినడానికి పిల్లలు ఇష్టపడరు. దీంతో బస్ హారన్ మోగగానే చాలా వరకూ ఖాళీ కడుపులతోనే ఇళ్ల నుంచి స్కూళ్లకు బయలుదేరి వెళ్లాల్సి వస్తోంది. స్కూల్‌కు చేరినా...తినడానికి 9 గంటలు లేదా...ఆపైన సమయం పడుతోంది. స్కూల్‌లో టీచర్ల అదిరింపులు, హడావుడి నడుమ తెచ్చుకున్న బాక్సును అరకొరగా తిని చెయ్యి కడిగేస్తున్నారు. ఇక మధ్యాహ్నం లంచ్ బాక్సులను మొత్తంగా వెనక్కు తెచ్చే పిల్లలు ఎంతో మంది ఉన్నారు. ఇక స్కూళ్లకు దగ్గరగా ఇళ్లు ఉన్న తల్లులు మాత్రం మధ్యాహ్నం క్యారియర్లు తీసుకుని వెళ్లి పిల్లలకు తినిస్తున్నారు. ఆ పిల్లల్లో ఈ సమస్య కనిపించకపోయినా ఇతర పిల్లల్లో మాత్రం ఈ సమస్య ఉంది.

సరిపడా మరుగుదొడ్లు ఏవీ...?

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలకు సరిపడా వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయడం లేదు. స్కూళ్ల ఏర్పాటుకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ డీఈఓ స్థాయిలో, 8,9,10 తరగతులకు ఆర్‌జేడీ స్థాయిలో అనుమతులు ఇస్తారు. స్కూల్‌లో ప్రతి క్లాస్‌కు కనీసం రెండు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. విద్యాశాఖ అధికారులు నిబంధనల మేరకు మొదటి సెక్షన్‌కు 60 మంది విద్యార్థులకు అనుమతి ఇస్తారు. మరో సెక్షన్ అంటే 40 మంది విద్యార్థులుండాలి. బిల్డింగ్, టాయిలెట్లు, టీచర్లను, ఇతర సదుపాయాలు కల్పించగలిగితే అదనంగా ఎన్ని సెక్షన్లకు అయినా అధికారులు అనుమతి ఇస్తారు. అయితే ఇక్కడ చాలా స్కూళ్లలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు ఏర్పాటు చేయడం లేదు. తరగతి గదిలో 60 మంది విద్యార్థులుంటే తప్పనిసరిగా బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల ఈ నిబంధనలు ఏ మాత్రం పాటించడం లేదు. వందలాది ప్రైవేట్ స్కూళ్లలో 3 లేదా, 4 టాయిలెట్లతోనే సరిపెడుతున్నారు. నామమాత్రంగా బాలికలకు, బాలురకు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతపురం నగరంతోపాటు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తాడిపత్రి వంటి పట్టణాల్లోని పలు కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లు అపార్టుమెంట్లులో ఏర్పాటు చేశారు. వీటిలో మూడు, నాలుగు అంతస్తుల్లోని క్లాసుల్లో ఉండే పిల్లలు కింద ఉండే టాయిలెట్లకు దిగొచ్చి మూత్రవిసర్జన, మల విసర్జన చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పిల్లలు నీళ్లు ఎక్కువ తాగితే ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లారంటూ టీచర్లు కట్టడి చేస్తున్నారు. సకాలంలో విద్యార్థులు వాష్‌రూమ్‌కు వెళ్లలేక అనారోగ్యాల బారిన పడుతున్నారు.



డిప్యూటీ డీఈఓ ఆఫీస్



ఎంఈఓ కార్యాలయం

తనిఖీ మరిచిన అధికారులు

జిల్లా వ్యాప్తంగా 670 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1.65 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలు నెలకు 20 వరకూ అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్ల విజిట్ చేయాల్సి ఉంది. అయితే ఇవి సర్వసాధారణం. కానీ ఇన్‌స్పెక్షన్ చాలా క్షుణ్ణంగా చేయాల్సి ఉంటుంది. కనీసం రెండు స్కూళ్ల అయినా...ఇన్‌స్పెక్షన్ చేయాల్సి ఉంటుంది. ఇది సుమారు 3 నుంచి 4 రోజులు చేయాల్సి ఉంటుంది. ఆ స్కూల్ రికార్డులు, అడ్మిషన్ల తతంగం, ఫీజుల వివరాలు, లెసన్ ప్లాన్స్, టీచర్ల విద్యార్హతలు ఇలా అన్నీ తనిఖీ చేయాలి. అయితే చాలా మంది ఎంఈఓలు....ఈ తతంగాన్ని పూర్తిగా పక్కనబెట్టేశారు. డీవైఈఓలు, ఎంఈఓలు మామూళ్ల వసూళ్లకు మాత్రమే ప్రైవేట్ స్కూళ్ల మొహం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు విజిట్స్, ఇన్‌స్పెక్షన్ నామమాత్రంగా మారడంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఇష్టారాజ్యంగా మారింది. దీనికితోడు డీవైఈఓలు, ఎంఈఓలు ముందుగానే టూర్ ప్రోగ్రామ్స్ ఉన్నతాధికారుల నుంచి అప్రూవల్ తీసుకోవాలి. ఆ టూర్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసిన తర్వాత టూర్ డైరీని ఉన్నతాధికారులకు అందజేయాలి. డీవైఈఓలు ఆర్‌జేడీల నుంచి, ఎంఈఓలు డీఈఓ నుంచి టూర్ ప్రోగ్రామ్స్ తీసుకుని, తర్వాత టూర్ డైరీలను ఉన్నతాధికారులకు అందజేయాలి. గతంలో టూర్ డైరీ ఇవ్వకుంటే జీతాలు సైతం నిలిపివేసేవారు. అయితే ప్రస్తుతం అంతా మామూలుగా మారిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యమే స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

పిల్లలు తగినంత నీరు తాగేలా చూడాలి

పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలి. ఆరోగ్యం బాగా లేకుంటే....ఆశించినంతగా ప్రతిభావంతులు కాలేరు. పిల్లల అవసరాలు, వారి ప్రవర్తన, సైకాలజీకి అనుగుణంగా బోధన చేయాలి. పిల్లలు స్కూళ్లలో తగినంత నీళ్లు తాగేలా చూడాలి. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా గతంలో అమలు చేసిన వాటర్ బెల్ పూర్తి స్థాయిలో అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి.



\- వెంకటరత్నం, అప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి

● నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు

మల, మూత్ర విసర్జన విషయంలో నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు కొనితెచ్చుకున్నట్లే. విద్యార్థి దశలో ప్రతి పిల్లవాడు కనీసం 2 నుంచి 3 లీటర్ల నీరు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే మల మూత్రాలు పద్ధతి ప్రకారం వస్తాయి. తిన్న ఆహారం జీర్ణమై పెద్ద పేగులలో 6నుంచి 8గంటలు మాత్రమే ఉంటుంది. ఆ సమయం దాటితే గట్టిగా మారి మలవిసర్జన ఇబ్బందిగా మారుతుంది. అపుడు తీవ్ర మలబద్ధకం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మూత్రానికి సరిగా వెళ్లకపోవడం, వస్తున్నా బిగిపట్టుకొని ఉండటం వల్ల మూత్రాశయ సంబంధిత వ్యాధులు వస్తాయి. కిడ్నీలలో చీముకారడం, రాళ్లు ఏర్పడడం వంటివి జరుగుతాయి. పదేపదే మూత్ర నాళాల ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి.



\- డాక్టర్ భీమసేనాచారి

● బాలికల్లో అనేక అనర్థాలు

నీరు సరిగా తాగకపోయినా, మలమూత్ర విసర్జన సకాలంలో చేయకపోయినా బాలికల్లో అనేక అనర్థాలు తలెత్తుతాయి. పాఠశాలల్లో సరైన వసతులు ఉండక, బాలికలు అక్కడ మలమూత్ర విసర్జనకు వెళ్లడానికి ఇబ్బంది పడతారు. సరిపడా నీళ్లు, అన్నం తీసుకోరు. ఇదే విషయం నా దగ్గరకు వచ్చిన తల్లిదండ్రులు చెబుతుంటారు. దీనివల్ల బాలికలు రక్తహీనత బారినపడి, ఇతర ఆరోగ్య సమస్యలతో చదువుపై ఏకాగ్రత కోల్పోతారు. నీరు సరిగా తాగకపోయినా, మూత్ర విసర్జనకు వెళ్లకపోయినా యూరిన్ ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువగా వస్తాయి. అందుకే ప్రతి విద్యార్థిని కనీసం రోజుకు 3లీటర్ల నీరు తప్పకుండా తాగాలి. మలమూత్ర విసర్జనల విషయంలో ఎప్పటికపుడు వెళ్లాలి.



\- డాక్టర్ షంషాద్ బేగం

కదిరి, తాడిపత్రి ఆలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి



కదిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జస్టిస్ సుజాత, న్యాయాధికారులు తదితరులు

కదిరి లీగల్/తాడిపత్రి, ఆగస్టు 24: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఆమెకు తూర్పు రాజగోపురం వద్ద ఆలయ ఈఓ, ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దారు మురళీకృష్ణ, డీఎస్పీ శ్రీలత స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పురోహితులు ఆలయ చరిత్రను, విశిష్టతను న్యాయమూర్తికి వివరించారు. స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట జిల్లా అదనపు న్యాయాధికారి సత్యవతి, న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షి సుందరి, కోర్టు పర్యవేక్షకులు అపర్ణ భాస్కర్ ఉన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడి సన్నిధిలో..

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి, గాయత్రీదేవి అమరలింగేశ్వరస్వామి ఆలయాలు, సత్యసాయి, శివసాయి మందిరాలను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత శనివారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ఆలయాల చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. శిల్పకల సంపదను తిలకించారు. అంతకుమునుపు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జస్టిస్ సుజాతకు స్వాగతం పలికారు. ఆమె వెంట అనంతపురం జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి సత్యవతి, తాడిపత్రి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కృష్ణవేణి, డీఎస్పీ జనార్దన్‌నాయుడు, ఈఓ సుబ్రహ్మణ్యం, తాడిపత్రి బార్ అసోసియేషన్ ట్రెజరర్ శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.



తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర ఆలయంలో...

వాస్తవాలు బయటపెట్టాలి

టీబీ డ్యాం గేట్ల ఎత్తు పెంపు అంశంపై సీపీఐ జగదీ‌ష్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 24: తుంగభద్ర డ్యాం గేట్ల ఎత్తు పెంచిన వాస్తవాన్ని బోర్డు అధికారులు బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీ‌ష్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర డ్యాం ఎత్తు 1633 అడుగులు కాగా ఒక అడుగు ఎత్తు పెంచి గోప్యంగా ఉంచారని ఆయన ఆరోపించారు. గేట్ల ఎత్తు పెంచినట్లు కనీసం రికార్డుల్లోనూ చూపలేదని విమర్శించారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా.. ఒక అడుగు ఎత్తు పెంచడం వల్ల 20 టీఎంసీల నీరు అదనంగా నిల్వ ఉంటోందని అన్నారు. దీని ఆధారంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటి వాటా ఎంతో చెప్పాల్సిన బాధ్యత డ్యాం అధికారులపై ఉందని అన్నారు. పెరిగిన నీటితో డ్యాం అధికారులు వ్యాపారం చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ, జిల్లాకు చెందిన మంత్రి డ్యాం ఎత్తు పెంచింది నిజమో కాదో తెలుసుకోవాలని సూచించారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు షిర్డీసాయి, అదానీ కంపెనీలు పోటీ పడ్డాయని, స్మార్ట్ మీటర్లను సీపీఐ, టీడీపీ, సీపీఎం వ్యతిరేకించాయని అన్నారు. ఆ కాంట్రాక్టర్‌ను, టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని, రైల్వే వ్యాగన్ల మరమ్మతు కేంద్రం ఏర్పాటుకు కూటమి నేతలు కృషి చేయాలని ఆయన కోరారు.

మూడు నెలల్లోనే రూ.20.4 కోట్ల నిధులు

- అన్ని మండలాలకు ఉపాధి హామీ నిధులు
- పార్టీ ముఖ్య నేతలకు వివరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూటమి అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లల్లోపే నియోజకవర్గానికి రూ.20.40 కోట్ల నిధులొచ్చాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు గడువులోగా పూర్తయ్యేలా చూడాలని నాయకులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నియోజక వర్గానికి ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయన్నారు. ఇందులో ఆత్మకూరు మండలానికి రూ. 2.5 కోట్లు, అనంతపురం రూరల్‌కి రూ. 5.1 కోట్లు, రాప్తాడుకు రూ. 2 కోట్లు, కనగానపల్లికి రూ.3 కోట్లు, రామగిరికి రూ. 3 కోట్లు, చెన్నేకొత్తపల్లికి రూ. 3 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు అదనంగా రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని ఆమె పార్టీ ముఖ్య నాయకులకు వివరించారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వచ్చేనెల నుంచి పనులు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే గ్రామాలవారీగా ఎక్కడెక్కడ ఏ ఏ పనులు చేపట్టాలో గుర్తించామన్నారు. గుర్తించిన ఆ పనుల ద్వారా గ్రామాల్లో రోడ్ల సమస్య తీరనుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒక్క పైసా నిధులు కేటాయించకుండా ఐదేళ్ల పాలన కొనసాగించారని ఆమె విమర్శించారు.

ఏటీఎం దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీ‌శ్

- అనంత, చిత్తూరు, కర్ణాటకలో చోరీలు
- అరకోటికిపైగా మాయం.. రూ.2 లక్షలే రికవరీ..
- పట్టుబడింది ఐదుగురు.. పరారీలో ఏడుగురు..

అనంతపురం క్రైం, ఆగస్టు 24: ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న హరియాణా దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో సుమారు కోటికి పైగా డబ్బు చోరీ చేసిన చేసిన వీరి నుంచి రూ.2లక్షలు మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. మొత్తం 12 మంది సభ్యులున్న ముఠాలో ఐదుగురు దొరికారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను ఎస్పీ జగదీ‌ష్ శనివారం డీపీఓలో వెల్లడించారు.

ఇవీ చోరీలు..

ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ప్రస్తుతం అరెస్టయిన ఐదుగురు, పరారీలో ఉన్న ఏడుగురు అక్కడికి వెళ్లారు. పోలీసులు, స్థానికులు గమనించకుండా ఎనిమిది మంది ఏటీఎం వద్ద వలయంగా ఏర్పడ్డారు. గ్యాస్ కట్టర్ నిపుణుడు సద్దాం సహా నలుగురు ముఖాలకు ముసుగులేసుకుని ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అందులో ఉన్న రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలో రూ.18,41,300 ఏటీఎంలలో చోరీ చేశారు. ఫిబ్రవరి 8న అనంతపురం నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి నగదు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీస్‌సైరన్ రావడంతో పారిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు.

అరెస్టయింది వీరే..

హరియాణాలోని నుహ జిల్లా అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, ఘసేరాకు చెందిన సలీం, రోజ్ కామియో గ్రామానికి చెందిన హక్మాఖాన్, అలీమియో గ్రామానికి చెందిన షాకీర్, రాజస్థాన్‌లోని భరత్ పుర జిల్లా అల్‌గని గ్రామానికి చెందిన మజీద్ అరెస్టు అయ్యారు. వసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారీష్, అతావుల్లా పరారీలో ఉన్నారు.

అరెస్టు ఇలా..

అనంతపురం జిల్లాలో వరుసగా ఏటీఎంలలో చోరీలు జరగడంతో అప్పటి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, నూతన ఎస్పీ జగదీ‌ష్ కేసులను ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐలు ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, సాయినాథ్, ఎస్ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌సీలు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్లు రంజిత్, దాస్, ఆసిఫ్, ప్రసాద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబుళేసు, వెంకటరమణ బృందాలుగా ఏర్పడ్డారు. ముఠాలోని ఐదుగురిని అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్డు పక్కన పొదలలో అరెస్టు చేశారు. వారి నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్‌ఫోన్లు, రూ.2లక్షల నగదు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు వీరిని అభినందించారు.

ముఠా నేపథ్యం

[illegible]లో రాబిన్, సలీం కీలక నిందితులు. షాకీర్ ట్రక్ డ్రైవర్. హరియాణా నుంచి బెంగళూరు హైవే మీద ప్రయాణిస్తూ.. ఏటీఎం కేంద్రాలు, అక్కడి భద్రత, సీసీ కెమెరాలు, రద్దీని గుర్తిస్తాడు. సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి.. రాబిన్, సలీంకు సమాచారం చేరవేస్తాడు. గ్యాస్ కటింగ్‌లో అనుభవమున్న సద్దాంతో రాబిన్ చర్చించి.. మిగిలిన సభ్యులను సమీకరించుకుంటాడు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ నంబర్లతో రెండు కార్లలో ఎంపిక చేసుకున్న ఏటీఎం కేంద్రాలకు వస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో.. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్యలో చోరీ చేస్తారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ముఠా సభ్యులకు ఇచ్చి, మిగిలిన మొతాన్ని రాబిన్ తన వద్దే ఉంచుకుంటాడు. హరియాణా వెళ్లాక వాటాలు వేసుకుంటారు. ఎస్‌బీఐ ఏటీఎంలలో ఎక్కువ నగదు ఉంటుందని.. వాటినే ఎక్కువగా చోరీలకు ఎంచుకుంటారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం చోరీలో కేసులో రాబిన్, సద్దాం, టౌసిఫ్ నిందితులు.



స్వాధీనం చేసుకున్న నగదు, గ్యాస్‌కట్టర్

ప్రమాదం తర్వాత ప్రమోదం

మళ్లీ నిండుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నీటితో మళ్లీ కళకళలాడుతోంది. టీబీ డ్యాం అధికారులు శనివారం లెక్కలు వేసే సమయానికి 85.113 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో నిలకడగా ఉంటోంది. డ్యాం పూర్తిగా నిండిన తర్వాత ఈనెల 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో నీటిని నదికి మళ్లించిన విషయం తెలిసిందే. క్రస్ట్ గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చారు. 70 టీఎంసీల నీటి నుంచి ఇప్పుడు 85.113 టీఎంసీల నీరు చేరాయి. ఈ ఆరురోజుల్లోనే దాదాపు 15 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరాయి. డ్యాం పై భాగంలో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంలో 85 టీఎంసీల నీరు చేరడంతో రైతుల్లోనూ, అధికారుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఖరీఫ్, రబీకి మూడు రాష్ట్రాలతో పాటు గ్రామాలకు తాగునీరు కూడా ఇబ్బంది ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నిలిపేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 24: రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు సైతం విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇపుడు అదే విధానాన్ని అమలు చేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సిద్ధపడటం సరికాదన్నారు. అదాని వంటి కార్పొరేట్ కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టడం వెనుక పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించి హైకోర్టులో పిటిషన్లు వేసిందని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించేందుకు నిర్ణయించడమేంటని ప్రశ్నించారు. విజయవాడ సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మీటర్లను ఇప్పటికే బిగిస్తున్నారని, తదుపరి వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు బిగించే ప్రక్రియకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

పంటకోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఆగస్టు 24: జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి పంటకోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం స్థానిక సీపీఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీఓ అశోక్‌కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి నరసింహారావుతో కలిసి ఏడీఏలు, ఏఓలు, ఏఎస్ఓలు, ఉద్యాన అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన పంటల దిగుబడిని తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన సమయంలోగా ప్రయోగాలు పూర్తి చేయాలన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయండి

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు



అధికారులు, సిబ్బందితో సమావేశమైన నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 24: జిల్లా వ్యాప్తంగా సాగులోని ఉద్యాన పంటలకు సంబంధించి ఈ- పంట నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఉద్యానశాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. శనివారం స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉద్యాన అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ-పంట నమోదును పూర్తి చేయాలన్నారు. ఉద్యాన పథకాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన రైతులను ఎంపిక చేయాలన్నారు. కొన్నిరోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించి, రైతులవారీగా పంటనష్టంపై సమగ్ర నివేదికలు త్వరగా పంపాలన్నారు.

100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

గార్లదిన్నె, ఆగస్టు 24: ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు 100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ సూచించారు. పింఛన్ల పంపిణీపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పింఛన్‌దారులకు ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు అందిస్తోందన్నారు. సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు సాయిగోకులం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 24: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సాయి ట్రస్టు, శ్రీనృత్యకళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో లలితకళాపరిషత్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు సాయిగోకులం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శ్రీకృష్ణ తులాభారం, గోపూజ, ఊయలసేవ, ఉట్లోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో...

రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు భావసార క్షత్రియ మహిళా మండలి అధ్యక్షురాలు మహేంద్రకర్ ప్రశాంతి వెల్లడించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించడంతోపాటు ఉట్టికొట్టే ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేడుకలకు సర్వం సిద్ధం

- దామోదర్ గౌరంగదాస్, ఇస్కాన్ మందిర చైర్మన్

ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లను సిద్ధం చేశాం. వేడుకల్లో భాగంగా ఆదివారం దర్శనహారతి, గురుపూజ, యజ్ఞసేవ, సోమవారం హరినామ సంకీర్తన, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టడం, 5 గంటలకు గరుడవాహన సేవ, 6 గంటలకు తెప్పోత్సవం, 7 గంటలకు ఊంజలసేవ నిర్వహించనున్నాం. మంగళవారం ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంత శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావోత్సవం సందర్భంగా మహాభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారం పూజలు



అలంకరణలో దుర్గాంజనేయస్వామి

శింగనమల, ఆగస్టు 24: మండలంలోని పలు దేవాలయాల్లో శ్రావణ మాసం మూడో శనివారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంపమల్లయ్య కొండకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బియ్యం, బేడలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. శింగనమల ఆత్మసీతారామస్వామి దేవాలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గొర్రెల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చెరువుకట్ట మీద వెలసిన దుర్గాంజనేయస్వామికి అర్చకులు మధు అభిషేకం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు తరుపున ప్రత్యేక పూజలు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



గోపిక, కృష్ణుడు వేషధారణలో చిన్నారులు

నార్పల, ఆగస్టు 24: మండలంలోని నల్లపరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుడు వేషధారణలో ఆకట్టుకున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మధుమాలిని మాట్లాడుతూ మన సనాతన సంప్రదాయాలను మరచిపోరాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మి, రమాదేవి, విజయకుమారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్కంఠ..!

● డీఆర్‌డీఏ, డ్వామా ఉద్యోగుల్లో బదిలీల గుబులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24: డీఆర్‌డీఏ-వెలుగు, డ్వామా ఉద్యోగుల్లో బదిలీల గుబులు మొదలైంది. ఈనెల 26 లోపు బదిలీ ఆప్షన్ ఇవ్వాలి. ఈనెల 31కి ఒకేచోట ఐదేళ్లు పని చేసి ఉండాలి. వివిధ కారణాలతో బదిలీ అయ్యే ఉద్యోగులకు సెప్టెంబరు 15 వరకు గడువు ఇచ్చారు. 15లోపు బదిలీ స్థానాల్లో చేరాల్సి ఉంటుంది. కొందరు కోరిన చోటికి బదిలీ చేయిస్తామని వసూళ్లకు తెరలేపినట్లు సమాచారం.



డ్వామాలో బదిలీ ఫీవర్

డ్వామా ఉద్యోగులకు బదిలీ ఫీవర్ పట్టుకుంది. డ్వామాలో ఏపీడీ, ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్‌ల స్థాయి నుంచి బదిలీ ఉంటుంది. ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. డ్వామా పీడీ ప్రస్తుతం బదిలీపై వెళ్లనున్నారు. కొత్త పీడీ వచ్చేటప్పటికి బదిలీలు పూర్తి కానున్నాయి. డ్వామాలో కీలకంగా ఉండే హెచ్‌ఆర్ విభాగంలో పనిచేసే కీలక అధికారి జిల్లాకు వచ్చి ఐదేళ్లు పూర్తి కానుంది. హెచ్‌ఆర్ విభాగంలో ఉద్యోగుల బదిలీల సినిమా నడుస్తోంది. అయితే ఇప్పటికే హెచ్‌ఆర్ విభాగంలో వసూళ్లపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డీఆర్‌డీఏలో...

డీఆర్‌డీఏ-వెలుగులో ఏపీడీ, పీఎం, డీపీఎం, ఏపీఎం, సీసీ, కంప్యూటర్ ఆపరేటర్ల స్థాయిలో ఉద్యోగుల బదిలీ ఉంటుంది. ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. రెండు, మూడు నెలల కిందట గతంలో పనిచేసిన పీడీ బదిలీల పేరుతో వసూళ్లకు పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అలాంటి వాతావరణం లేకపోయినా ఆయా స్థాయిలో ఉద్యోగులు బేరసారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది.

27 నుంచి బదిలీల కౌన్సెలింగ్

డీఆర్‌డీఏ, డ్వామాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈనెల 31లోపు బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేయాలి. సెప్టెంబరు 1కి బదిలీ అయిన స్థానంలో ఉద్యోగులు విధుల్లో చేరాలి. రిక్వెస్ట్, మ్యూచువల్, స్పౌజ్, మెడికల్, అలిగేషన్ అంశాలు ఉన్న వారికి సెప్టెంబరు 15లోపు బదిలీలు పూర్తి చేయనున్నారు.

నేడు వ్యవసాయ శాఖ ఉద్యోగుల ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 24: ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని రైతు బజార్ వద్ద కృషి భవన్‌లో ఉదయం 10 గంటలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌ను నియమించామన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నుంచి క్లాస్ ఫోర్ ఉద్యోగులదాకా ప్రతిఒక్కరూ హాజరై, ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు: సీఐ

శింగనమల, ఆగస్టు 24: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని పెద్ద జలాలపురం వంక ప్రాంతం నుంచి రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. దీనిపై ఆ గ్రామస్థులతో సీఐ మాట్లాడుతూ వంక ప్రాంతంలో ఎవరైనా ఇసుక తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే ఏ పార్టీ నాయకుడైనా వదిలేదిలేదన్నారు. వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

హోమియో మందుల పంపిణీ

అనంతపురం టౌన్, ఆగస్టు 24: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుజాగ్రత్తలో భాగంగా హోమియో మందులు పంపిణీ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టురోడ్డు శ్రీసత్యసాయి జూనియర్ బాలికల కళాశాలలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. హోమియో డాక్టర్ తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు చేశారు. అనంతరం మందులు ఉచితంగా అందించారు. తిరుపతినాయుడు మాట్లాడుతూ హోమియో మందులు ముందుగా వాడితే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చన్నారు. ఆయుష్ ఫార్మసిస్టు సుదర్శన్, శాంతమ్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 24: మండలంలోని ఎన్ఎస్‌గేటు వద్ద శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న మహిళ ఆచూకీ లభ్యమైనట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీవిద్య(34)గా గుర్తించామన్నారు. శ్రీవిద్యకు 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడం దీనికితోడు అనారోగ్యంతో బాధపడుతుండేదని అన్నారు. జీవితంపై విరక్తిచెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, ఆగస్టు 24: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన జెన్నె పెద్దన్న వైద్యం ఖర్చులకు శింగనమల నియోజకవర్గం టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందచేశారు. మండల మాజీ కన్వీనర్ జయరాం, మాజీ సర్పంచు సుంకన్న, వడ్డేవన్నూర్, నరసింహారెడ్డి, చితంబరప్ప, రమణ, అంజి, సునిల్ పాల్గొన్నారు.

సెల్టాస్ వాహన కస్టమర్లకు బహుమతులు



వాహన కస్టమర్లకు బహుమతులను అందిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురంరూరల్, ఆగస్టు 24: కియ కంపెనీ సెల్టాస్ వాహన కస్టమర్లకు యాక్ససర్వీస్‌ను బహుమతిగా అందజేశారు. శనివారం హైవేలోని ఎం.జి.బ్రదర్స్ కియా వాహన షోరూంలో సెల్టాస్ మైల్ ఏ థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెల్టాస్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న కస్టమర్లలో అత్యధిక మైలేజ్ సాధించిన వారికి రూ.10వేల విలువగల యాక్సస్ సర్వీస్‌ను అందించారు. సెల్టాస్ మైల్ ఏ థాన్ కార్యక్రమాన్ని మైలేజ్ తీసిన విజేతలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులను అందించారు. ఎం.జి.బ్రదర్స్ కియా సీఈఓ ఆదిత్య మాచాని, పీవీకేకే డిప్లొమో ప్రిన్సిపాల్, ప్రముఖ యూట్యూబర్ వైభవ్ చేతుల మీదగా వాటిని బహూకరించారు. ఎంజీబీ కియా జనరల్ మేనేజర్ ఎల్లప్ప, సేల్స్ జీఎం గిరిప్రసాద్, మేనేజర్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 24: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని సెబ్ సీఐ లలితేదేవి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ ఎస్ఐ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, ఆగస్టు 24: గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీదేవి హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో శనివారం గర్భస్థపిండ లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలు జిల్లా కమిటీతో డీఎంహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలామంది కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించుకుంటుండటంతో కేంద్రం 1994లో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈచట్టం ప్రకారం ఏ గర్భిణికైనా లింగనిర్ధారణ పరీక్షలు చేసి కడుపులో ఉన్నది ఫలానా శిశువు అని చెప్పకూడదన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరిం చారు. ప్రోత్సహించిన డాక్టర్లపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అవసరమైతే డాక్టర్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తామని తెలిపారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, కమిటీ అధికారులు, సభ్యులు ఈలింగనిర్ధారణ చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు యుగంధర్, సుజాత, రవిశంకర్, నారాయణస్వామి, అనుపమ జేమ్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్, ఏపీఆర్ఓ హరినాథ్‌నాయక్, రెడ్స్ భానుజా, డెమోలుత్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, ఆగస్టు 24: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 3500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. ఇందులో 102 టన్నులు నో సేల్ కింద పడినట్లు వెల్లడించారు.

చీనీకాయలు టన్ను రూ.23వేలు: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

వైభవంగా ఏడుశనివారాల వ్రతం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 24: ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా ఆరవ శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వేణుగోపాల్ సద్గురు సాయినాథ మందిరం, ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వర దేవాలయం,



ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు



వేణుగోపాల్‌నగర్ సాయినాథమందిరంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమాల్లో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం విద్య, ఆగస్టు 24: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో శనివారం క్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికలు, యశోధ, రాధాకృష్ణుల వేషధారణల్లో ముస్తాబు చేసి, ఉట్టి కొట్టించి సందడి చేశారు. స్కూళ్ల ఆవరణలు బృందావనాలను తలపించాయి. నగరంలోని మినర్వా స్కూల్‌లో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారుల ఉట్టికొట్టారు. మాంటిస్సోరి విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు రమాదేవి, టీచర్లు పాల్గొన్నారు. శ్రీరామకృష్ణ విద్యామందిర్‌లో క్రిష్ణాష్టమి వేడుకలతో కోలాహలం నెలకొంది. కరస్పాండెంట్ సునీత, డైరెక్టర్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. రాంనగర్ నారాయణ స్కూల్‌లో ఏజీఎం రమేష్, ప్రిన్సిపాల్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా చేశారు. కోర్టురోడ్డు శ్రీచైతన్య స్కూల్ వేడుకలలో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మినర్వా స్కూల్‌లో చిన్నారుల కోలాహలం



మాంటిస్సోరీలో..



రామకృష్ణ విద్యామందిర్‌లో...



నారాయణ స్కూల్‌లో..



శ్రీచైతన్యలో...

టీడీపీ యాప్ ప్రజలకు దగ్గర చేస్తుంది..



టీడీపీ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 24: టీడీపీ యాప్ నాయకులు, కార్యకర్తలను ప్రజలకు దగ్గర చేస్తుందని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఆ కార్యకర్తలను ప్రత్యేకంగా సన్మానించి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రినారా లోకేశ్ నుంచి వచ్చిన ప్రశంసాపత్రాలను వారికి అందించి అభినందించారు. యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

కూటమి ప్రభుత్వం.. బాధితుల పక్షం



మాట్లాడుతున్న ఆవులక్రిష్ణయ్య

గార్లదిన్నె, ఆగస్టు 24: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మ కంపెనీలో మృత్యువాత పడిన బాధితుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలిచిందని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇలాంటి దుర్ఘటనలు ఎన్నో జరిగాయన్నారు. నాటి సీఎం వైఎస్ జగన్ బాధితులను పరామర్శించిన పాపన పోలేదన్నారు. మునుముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన ఈ సంఘటనపై సీఎం చంద్రబాబునాయుడు వెంటనే స్పందించారన్నారు. ఆస్పత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించారన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.

ఎస్ఐ సాగర్ బాధ్యతల స్వీకరణ



నార్పల, ఆగస్టు 24: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గా సాగర్ శనివారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి అనంతపురం వీఆర్‌కు బదిలీకాగా ఎస్ఐగా సాగర్‌ను నియమించారు. ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ పేకాట, బెట్టింగ్‌లాంటి జూదాలను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. అలాగే ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. ఆందోళనలు ఉధృతం

● సత్యసాయి తాగునీటి కార్మికులు



కల్లూరులో సత్యసాయి పంపు హౌస్ వద్ద సమ్మెలో పాల్గొన్న కార్మికులు

గార్లదిన్నె, ఆగస్టు 24: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సత్యసాయి తాగునీటి కార్మికులు డిమాండ్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లూరులోని సత్యసాయి పంపుహౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి మూడు రోజులకు చేరుకుంది. వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నామన్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు నాగభూషణం, బాషా, మల్లరాయుడు, శ్రీనివాసులు, సాంబశివ, జనార్ధన్‌రెడ్డి, నాగవర్ధన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 24: నీలకంఠాపురం శ్రీరాంరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్, సత్యసాయి వాటర్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖను పంపారు. కార్మికులకు ఆరునెలలుగా రావాల్సిన బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటివి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబరు 5 నుంచి సమ్మె చేపడతామని హెచ్చరించారు.

11 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 24: జిల్లాలోని 11 మండలాల్లో శుక్రవారం వర్షం పడింది. అత్యధికంగా ఆత్మకూరులో 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతపురం 6.4, పామిడి 6.2, రాప్తాడు 6.0, నార్పల 5.6, గుంతకల్లు 4.4, కూడేరు 4.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.0 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, లైఫ్ స్కిల్స్ వర్క్ ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో అత్యుత్తమ నాణ్యమైన నైపుణ్య శిక్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి 20-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణాకాలంలో మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు, పేర్ల నమోదుకు 7396950345, 7780752418 నంబర్లను సంప్రదించాలని కోరారు.

26 నుంచి ఎఫ్‌డీపీ శిక్షణ

అనంతపురంరూరల్, ఆగస్టు 24: స్థానిక పీవీకేకేఐటీలో 26వ తేదీ నుంచి ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై ఏఐసీటీఈ ఆధ్వర్యంలో అటల్ అకాడమీ నిర్వహించే శిక్షణ, అభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమం ఆరు రోజుల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూఏ డాక్టర్ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. శిక్షకులుగా ఎన్ఐటీ, ప్రభుత్వ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు, పారిశ్రామిక నిపుణులు రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పరిశోధకులు, అధ్యాపకులకు విద్యుత్ వాహనాల రంగంలో తాజా పరిజ్ఞానం, ఆధునిక సాంకేతిక, శాస్త్రీయ ఆవిష్కరణలను సమగ్రంగా బోధించేడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు.

నేడు డీఎస్సీ కోచింగ్ కేంద్రం ప్రారంభం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 24: టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న టెక్స్‌టైల్స్ పార్కులో ఏర్పాటుచేసిన కోచింగ్ సెంటర్‌ను ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కాలవ హాజరై ప్రారంభిస్తారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని డీఎస్సీ, టెట్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

● ముగ్గురు విద్యార్థులకు గాయాలు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 24: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం బైక్‌ను లారీ ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన సాయి పదో తరగతి, హేమంత్, చరణ్‌లు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాగా సాయి బైక్‌లో హేమంత్, చరణ్‌ను ఎక్కించుకుని కళాశాలలో వదిలేందుకు బయలు దేరాడు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రాగానే లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో సాయి ఎడమ కాలు విరిగింది, హేమంత్, చరణ్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరి యువకులకు..

గుత్తి: పట్టణంలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన సాయికుమార్, చరణ్ బైక్‌లో పట్టణంలోని అనంతపురం వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో బైక్ వేగంగా వచ్చి ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో సాయికుమార్, చరణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి..

గుత్తిరూరల్: మండలంలోని రజాపురం గ్రామశివారులో గల 67వ జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుంతకల్లుకు చెందిన మనోహర్ రెడ్డి కర్నూలుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. రజాపురం గ్రామ శివారులోకి రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

గుత్తి, ఆగస్టు24: పట్టణంలోని కుక్కలబావి సమీపంలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ చంద్రశేఖర్ (53) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. పలుచోట్ల చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలుకింద పడి ఒకరు..


రంగనాయకులు (ఫైల్)

తాడిపత్రి, ఆగస్టు 24: పట్టణ సమీపంలోని యల్లనూరు రైల్వేగేటు వద్ద రంగనాయకులు (43) అనే వ్యక్తి శనివారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన రంగనాయకులు కూలి పనులకు వెళుతుండేవాడు. కాగా కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఎవరూలేరు. వివాహమూ కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

తాడిపత్రి, ఆగస్టు24: పట్టణంలోని ఐశ్వర్య విల్లాస్ సమీపంలో రెండురోజులక్రితం ద్విచక్రవాహనం అదుపు తప్పి తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు పెద్దన్న (70) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. పుట్లూరు మండల చింతకుంటకు చెందిన పెద్దన్న ఈనెల 23వ తేదీన ద్విచక్రవాహనంలో పని నిమిత్తం కడపజిల్లా ఆర్ఎస్ కొండాపురానికి వెళ్లాడు. పని అనంతరం తిరిగి వస్తుండగా.. ఐశ్వర్యవిల్లాస్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి ఉన్నారు. కుమార్తె వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి, ఆగస్టు 24: మండలంలోని చందన గ్రామం వద్ద శనివారం పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశామని, అక్కడ పేకాటాడుతున్న 8మందిని అరెస్ట్ చేసి, వారివద్ద నుంచి రూ.7300 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

కుందుర్పి: మండలంలోని ఎస్ మల్లాపురం గ్రామ సమీపాన పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. అందులో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. ఐదు వేలు నగదుతో పాటు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరికొంత మంది పారిపోయారని, వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

ఐసీడీఎస్ కార్యాలయానికి ర్యాక్‌లు

గుత్తి, ఆగస్టు 24: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి 40 ఐరన్ ర్యాక్‌లను గుంతకల్లు ఆర్టీఓ శ్రీనివాసులు రెడ్డి శనివారం వితరణ చేసినట్లు సీడీపీఓ ఢిల్లీశ్వరి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని 40 అంగన్‌వాడీ కేంద్రాలకు ఉపయోగపడేలా ర్యాక్‌లను అందజేశారన్నారు.

పంటల నమోదు పరిశీలన

ఉరవకొండ, ఆగస్టు 24: మండలంలోని కోనాపురం గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని మైక్రో ఇరిగేషన్ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ శనివారం పరిశీలించారు. పంటల నమోదు ఆవశ్యకతను రైతులకు వివరించారు. తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తాయన్నారు. బోరు బావులు కలిగిన రైతులు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతుసేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రైతుసేవాకేంద్రం సిబ్బంది చిక్కన్న, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

● భక్తులతో కిక్కిరిసిన హనుమాన్, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు


మల్లాపురంలో పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి


వద్రవన్నూరులో ప్రత్యేకాలంకరణలో అపులాపురం ఆంజనేయస్వామి


కుందిర్పి మండలం కరిగానపల్లిలో..


యల్లనూరులో..

రాయదుర్గంరూరల్, ఆగస్టు 24 : మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, వద్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రావణ మాస పూజల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయాల్లోని మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సా యంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కుందుర్పి: శ్రావణ మాసం మూడోశనివారం సందర్భంగా మండలంలోని అపిలేపల్లి, కరిగానపల్లి, కుందుర్పి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే మూలవిరాట్‌లకు అభిషేకాలు చేసి తమలపాకులతో, వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకుని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.

యల్లనూరు: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయమే అర్చకులు స్వామివారికి పలు అభిషేకాలు చేసి తమలపాకులతో అలంకరించారు. అనంతరం ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు. పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణ మాసం మూడో శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

● పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయరాం




పూజలు చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్

గుంతకల్లు, ఆగస్టు 24: మండలంలోని ములకలపెంటలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అందజేసిన రూ.3 లక్షల విరాళంతో ములకలపెంటలో గ్రామస్థులు వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వేటగాడిగా ఉన్న వాల్మీకి రామాయణాన్ని రచించి మహర్షిగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు తలారి మస్తానప్ప, గుమ్మనూరు నారాయణ, రామన్న చౌదరి పాల్గొన్నారు.

ఎంపీ పూజలు..

ములకలపెంటలోని వాల్మీకి విగ్రహానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పూల మాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామాయణం రచించి మానవజాతికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పేర్కొన్నారు. మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్రగౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ. జగదీశ్ కూడా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. టీడీపీ నాయకులు పత్తి హిమబిందు, టీ కేశప్ప, శివయ్య, నాగరాజు, సీపీఐ నాయకుడు వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్షం రాకతో పంటలు కళకళ..


ఉరవకొండ వద్ద కళకళలాడుతున్న కంది పైరు

ఉరవకొండ, ఆగస్టు 24: వర్షాభావంతో ఎండుతున్న పంటలకు గత వారం నుంచి కురుస్తున్న వర్షాలతో జీవం పోసినట్లైంది. దీంతో ప్రస్తుతం పంటలు కళకళలాడుతున్నాయి. ఉరవకొండ డివిజన్ పరిధిలో చాలామంది రైతులు పత్తి, వేరుశనగ, కంది, ఆముదం పంటలను సాగు చేశారు. కంది 3,367హెక్టార్లు, వేరుశనగ 4,517హెక్టార్లు, ఆముదం 399హెక్టార్లలో సాగయ్యాయి. వర్షాలు సమృద్ధిగా రావడం వల్ల అన్ని పంటలు కళకళలాడుతున్నాయి. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

గుంతకల్లు టౌన్, ఆగస్టు 24: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేపట్టారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ టీవీ స్టేషన్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు వాణిశ్రీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్


కుళ్లిపోయిన టమోటా మొక్కను ఇన్‌చార్జి కలెక్టర్‌కు చూపిస్తున్న ఏడీఏ యల్లప్ప

కళ్యాణదుర్గం, ఆగస్టు 24: మండలంలోని గోళ్ల గ్రామంలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నారాయణ శర్మ శనివారం పరిశీలించారు. రైతు చంద్రశేఖర్ ఐదు ఎకరాలలో సాగు చేసిన టమోటా, కర్బూజా పంటలు వర్షం దెబ్బకు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఆ పొలాలను ఇన్‌చార్జ్ కలెక్టర్ పరిశీలించి రైతుతో మాట్లాడారు. నిబంధనల మేరకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుష్మిత, ఏడీఏ యల్లప్ప, తహసీల్దార్ భాస్కర్, ఏవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

రాయదుర్గంరూరల్, ఆగస్టు 24: మండలంలోని జుంజురాంపల్లి ఇసుక స్టాక్ పాయింట్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నారాయణ శర్మ శనివారం తనిఖీ చేశారు. ఇసుక స్టాక్ నమోదు చేసే రికార్డులను పరిశీలించి స్టాక్ పాయింట్ వద్ద ఎంత ఇసుక నిల్వ వుంది. ప్రతిరోజు ఎన్ని లోడ్‌లు పంపిస్తున్నారు? తదితర వివరాలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరుగకుండా నిఘా వుంచాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్టాక్ పాయింట్ వద్ద వాహనాలు ఎలాంటి క్యూ లేకుండా ఎప్పటికప్పుడు ఇసుక లోడ్‌చేసి పంపించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే ఇసుకను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుష్మిత, మైన్స్ డీడీ నాగయ్య, వీఆర్వో భీమప్ప, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్లు అందించాలి

బెళుగుప్ప, ఆగస్టు 24: పింఛన్ లబ్ధిదారులకు ప్రతిఒక్కరికీ సెప్టెంబరు ఒకటో తేదీనే పింఛన్లు అందించాలని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేసే అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చేనెల ఒకటో తేదీన ఉదయం 6 గంటలకు పింఛన్లు పంపిణీ తప్పకుండా ప్రారంభించాలని తెలిపారు. ఆరోజే లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన

యల్లనూరు: మండలంలో సెప్టెంబరు 1వ తేదీన చేపట్టే పింఛన్ల పంపిణీపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించామని, ఇందులో ఒకటో తేదీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటలలోపు వందశాతం పింఛన్ల పంపిణీని పూర్తిచేయాలని సూచించామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 24: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా వంశీకృష్ణ భార్గవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ నర్సారెడ్డి హెడ్‌ఆఫీస్‌కు రిపోర్టు చేసుకోనున్న నేపథ్యంలో.. పెనుకొండ కమిషనర్‌గా ఉన్న వంశీకృష్ణ భార్గవ్ బదిలీపై వచ్చారు.


రోడ్డుపై వ్యాపారాలు చేయరాదు

ఉరవకొండ, ఆగస్టు 24: పట్టణంలోని టవర్‌క్లాక్ చుట్టూ కూరగాయాలు, ఆకుకూరల అమ్మకాలు చేపడుతుండడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రధాన రహదారిపై వ్యాపారాలు చేయరాదని పంచాయతీ కార్యదర్శి గౌస్ పేర్కొన్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలి, పాతబస్టాండ్ ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. రోడ్డు మీద వ్యాపారాలు చేసి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించరాదని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జయకుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపల్లికి 972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 24: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.175 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

28 నుంచి జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు


అమ్మవారి సమాధి

ఉరవ కొండ, ఆగస్టు 24: పట్టణంలోని బీబీ జైనబ్బీ ఉరుసు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించనున్న ట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉరుసు నేపథ్యంలో దర్గాను ముస్తాబు చేశారు. 28న అల్లపరెడ్డి ఇంటి నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై పట్టణ వీధుల గుండా దర్గాకు చేర నుంది. 29న ఉరుసు కార్యక్రమంలో భాగంగా షంషేర్ ఊరేగింపు ఉంటుంది. 30న జియారత్ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి అమ్మవారికి చాదర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్తారు. అదే రోజు రాత్రి దర్గా ఆవరణలో ఖవ్వాలీ పోటీలు జరుగుతాయి.

గుత్తి చెరువుకు నీరు విడుదల

● వైటీ చెరువు తూమును తెరిచి విడుదల చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


వైటీ చెరువు తూమును తెరుస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, ఆగస్టు 24: మండలంలోని వైటీ చెరువు నుంచి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుత్తి చెరువుకు నీటిని విడుదల చేశారు. ఆయన శనివారం ఉదయం వైటీ చెరువు తూమును తెరచి నీటిని వదిలారు. గుత్తి పట్టణానికి నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో చెరువును నింపే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుత్తిలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా తొలుత గుత్తి చెరువును నింపే కార్యక్రమానికి నాంది పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

బొమ్మనహాళ్, ఆగస్టు 24 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి శనివారం ఆయన దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం ఆలయం వద్ద భద్రతను పర్యవేక్షించి విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. సరిహద్దు గ్రామాల్లో పోలీసు నిఘా పెంచామన్నారు. శ్రావణమాసం పూర్తయ్యేవరకు మురడి, నేమకల్లు గ్రామాలలో ఆలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. డీ హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాదరెడ్డి, ఏఎస్ఐ హనుమంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్‌పతి దీదీ లాంచింగ్ ప్రత్యక్ష ప్రసారం

యాడికి, ఆగస్టు 24: మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న లక్‌పతి దీదీ పథకం లాంచింగ్ కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ శనివారం ప్రకటనలో తెలిపారు. లక్‌పతి దీదీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలకు వడ్డీలేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలను పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా 2కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూర్చాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నా రు. ఈ పథకాన్ని జలగావ్‌లో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తున్నారని, మండలంలో ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించడానికి వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొనాలని ఆయన కోరారు.

డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 24: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపం లో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వన మహో త్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు , అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కలిసి మొక్కలను నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు




శ్రీనివాస విద్యానికేతన్, సన్‌రైజర్ పాఠశాలల్లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

బెళుగుప్ప, ఆగస్టు 24: మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం, సన్‌రైజర్ పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలలో నృత్యాలు చేసి, ఉట్లు కొట్టి అలరించారు. స్థానిక వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, రుషికేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరెస్పాండెంట్లు శ్రీనివాసులు, మారెన్న, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ నుంచి జారిపడిన కర్రలు


లారీ నుంచి రోడ్డుపై పడిన కర్రలు

యాడికి, ఆగస్టు 24: కలపను తరలిస్తున్న లారీ నుంచి కర్రలు జారిపడి రోడ్డుపై పడ్డ సంఘటనలో తృటిలో పెనుప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో శనివారం ఉదయం కలపను తరలిస్తున్న లారీ గుత్తివైపు వెళుతోంది. శాంతికాలనీలో కలప లోడ్‌కు కట్టిన తాడు తెగిపోవడంతో లోడ్‌పై భాగం నుంచి కర్రలు కొన్ని జారి రోడ్డుపై పడ్డాయి. వెనుక ద్విచక్రవాహనదారులు ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు తప్పుకున్నారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు లారీడ్రైవర్‌ను తీవ్రస్థాయిలో మందలించారు.

దారి మళ్లించిన రైళ్లను పునరుద్ధరించాలి

గుత్తి, ఆగస్టు 24: గుంతకల్లు మీదుగా దారి మళ్లించిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుత్తి మీదుగా తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికాలక్ష్మీనారాయణను స్థానిక టీడీపీ నాయకులు, పలువురు రైల్వే విశ్రాంత ఉద్యోగులు కోరారు. పట్టణంలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ స్వగృహంలో శనివారం వారు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైల్వేకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును గుత్తిలో నిలిపేలా చూడాలన్నారు. అలాగే గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు రంగారెడ్డి యాదవ్, డాక్టర్ నాగేంద్ర, న్యాయవాది సోమశేఖర్, బీజేపీ నాయకులు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ ఆపాలని వినతి

కుందుర్పి, ఆగస్టు 24: మండలంలోని మాయదార్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను యథావిధిగా ఇక్కడే కొనసాగించాలని కోరుతూ గ్రామస్థులు శనివారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామ పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 108 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వారందరికీ ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అయితే ఇటీవల వీరిలో నలుగురు పాధ్యాయులను వేరే పాఠశాలలకు బదిలీ చేశారని, దీంతో మిగిలిన నలుగురు ఉపాధ్యాయులు అంతమంది పిల్లలకు చదువు ఎలా చెప్పగలని వాపోయారు. ఇలా అయితే మా పిల్లల భవిష్యత్తు ఏంకావాలని ప్రశ్నించారు. కావున ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీ నిలిపివేసి వారికి యథావిధిగా ఇక్కడే కొనసాగించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన దళిత గిరిజనుల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల్ని పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని, ఫలితం మాత్రం శూన్యమని అన్నారు. అధికశాతం భూసమస్యలు అర్జీల రూపంలో ములుగుతున్నా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నేటికీ దళితులు చనిపోతే వారికి ఖర్మకాండలు చేయడానికి శ్మశానాలు లేని గ్రామాలు ఉండటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికీ దాడులకు, దౌర్జన్యాలకు, వివక్షతకు గురవుతుండడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలపై స్పందించి న్యాయం చేయాలన్నారు. లేకపోతే ఎస్సీ, ఎస్టీలను చైతన్యపరచి పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ తాలుకా ఇన్‌చార్జి చెలిమప్ప, నాయకులు మోహన్, దాబా రమేష్, మారెన్న, గంగన్న, ఆదెప్ప, రామచంద్ర, దొడగట్ట నాగరాజు పాల్గొన్నారు.

డ్రిప్పు కోసం దరఖాస్తు చేసుకోండి

విడపనకల్లు, ఆగస్టు 24: మండలంలోని రైతులు బిందు సేద్యంలో భాగంగా డ్రిప్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పెన్నయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. పొలాల్లో డ్రిప్పు అవసరమైన వారు మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. త్వరలోనే ప్రభుత్వం సబ్సిడీ ప్రకటిస్తుందని, ఆ మేరకు డ్రిప్పులు మంజూరు చేస్తామని తెలిపారు.